



ట్రాఫిక్ డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

‘ఎమ్మెల్యే, మంత్రి తాలూకా’ పేరుతో..

రోడ్లపైకి వాహనాలు

చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ డీఎస్పీకి డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కొంతమంది వాహనదారులు రోడ్డు రవాణా శాఖ అధికారులు కేటాయించిన రిజిస్ట్రేషన్ నెంబర్లకు బదులుగా ఫలానా ఎమ్మెల్యే.. మంత్రి తాలూకా అంటూ నెంబర్ ప్లేట్లపై రాసుకుంటూ తిరుగుతున్నారని, అలాంటి వాహనాలను సీజ్ చేయాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం నాడు ట్రాఫిక్ డీఎస్పీ నారాయణరెడ్డిని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకష్ణ కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నెంబర్ ప్లేట్‌కు బదులుగా ఫలానా ఎంఎల్ఎ తాలూకా అంటూ కొందరు రాసుకుని రోడ్లపై తిరుగుతున్నారన్నారు. అలాంటి వాహనాలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతపురం నగరంలో స్పీడ్‌గన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు డి.చరణ్, ఖాసిం పాల్గొన్నారు.



◆రాజీనామా చేసిన వారి భవిష్యత్తు అగమ్యగోచరం

◆కొనసాగింపుపై స్పష్టతనివ్వని ప్రభుత్వం



వాలంటీర్ల భవితవ్యం ఎటు..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గడిచిన ఐదేళ్లుగా ప్రజలకు సేవలందించిన వాలంటీర్ల భవిత్యం ఏ రకంగా ఉండనుందన్న దానిపై ఇప్పుడు సర్వత్రా చర్చ నడుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలోనే ఆ వ్యవస్థను కొనసాగిస్తామని హామీనిచ్చారు. తాజాగా కూడా అటువంటి ప్రకటనే రావడంతో ముందు పనిచేసిన వాలంటీరర్లలో కొంత ఊరట కనిపిస్తోంది. కొత్త వారిని నియమిస్తారా.. లేక పాత వారినే కొనసాగిస్తారా..? అన్న సందేహాలు మాత్రం ఉత్పన్నం అవుతున్నాయి. ఒకవైపు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు మాత్రం రాజీనామా చేసిన వారిని కొనసాగించే అవకాశం లేదన్న ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో తమ పరిస్థితి ఏ రకంగా ఉండనుందన్న దానిపై వాలంటీర్లలో సందిగ్ధత నెలకొంది.

రాజకీయ ఒత్తిళ్లతో సాగిన రాజీనామాలు

ఎన్నికల సమయంలో వాలంటీర్ల సేవలను వినియోగించుకునేందుకు వీల్లేదని ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. దీంతో ఎన్నికల్లో తమకు అనుకూలంగా పనిచేస్తారని భావించిన అప్పటి అధికార పార్టీ ఈ నిర్ణయంతో వారిని ఏకంగా విధుల నుంచి తప్పుకునేలా రాజకీయపరమైన ఒత్తిళ్లు తీసుకొచ్చారు. అప్పటి ప్రజాప్రతినిధులే ఒక ఫార్మట్‌ను రూపొందించి అందరితో సంతకాలు తీసుకున్నారు. ఇందుకు మూడు నెలల వేతనాన్ని కూడా పార్టీ తరుపున ఇస్తున్నామని కొంత మొత్తాన్ని ముట్టజెప్పారు. తరువాత అధికారంలోకి వచ్చేది తామే, తిరిగి విధుల్లోకి తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో నేతలిచ్చిన ఫార్మట్‌పై సంతకాలు చేసి ఇచ్చారు. ఈ రాజీనామాలను అప్పుడు ఎన్నికల సంఘం పాలనలోనున్న అధికారులు ఆమోదించారు. ఎన్నికల ఫలితాలు వైసిపికి ఊహించని విధంగా వచ్చాయి. దీంతో వాలంటీర్ల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారింది. అనంతరం కొత్త ప్రభుత్వం కూడా ఉన్న వారినైనా ఏ రకంగా ఉపయోగించుకుంటుందో ఇంత వరకు ప్రకటించలేదు. వారి చేత ఇప్పటి వరకు సేవలు వినియోగించుకోలేదు.

రాజీనామా చేయని వారు నామమాత్రమే

అనంతపురం జిల్లాలో 571 గ్రామ పంచాయతీలతోపాటు, అనంతపురం నగరపాలక సంస్థ తోపాటు ఐదు మున్సిపాలిటీలున్నాయి. ఇందులో ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున వాలంటీర్లను గత ప్రభుత్వం నియమించింది. పది వేల మందికిపైగా ఉన్నారు. ఇందులో అత్యధిక మంది రాజీనామాలు చేశారు. ఉదాహరణకు ఒక్క అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోనే 1147 మంది వంటీర్లు పనిచేసేవారు. ఎన్నికల సమయంలో వీరిలో 1108 మంది రాజీనామాలు చేశారు. తక్కిన 39 మంది మాత్రమే విధుల్లోనున్నారు. ఇప్పుడు వీరిలో ఎవరిని విధుల్లోకి తీసుకోలేదు. ప్రభుత్వం దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.

27న సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి

స్వయం ప్రతిపత్తిపై సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక నాయకులు

అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రతిపత్తి, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27వ తేదీన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నట్టు పలువురు వక్తలు తెలిపారు. బుధవారం నాడు మున్సిపల్ కాంప్లెక్స్‌లో పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నగర పౌరులు ఎదుర్కొంటున్న సమస్యలు డ్రెయినేజీ, స్పీడ్ బ్రేకర్లు, రోడ్ల సమస్యలు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ స్వయం ప్రతిపత్తిపై సమావేశంలో చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈసందర్భంగా పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు అడ్వకేట్ రసూల్ మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ స్వయం ప్రతిపత్తిపై ఈ నెల 27వ తేదీన అనంతపురం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద నిర్వహించే అఖిలపక్ష సమావేశానికి పౌరులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌరసంఘాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఏజీ.రాజమోహన్, కార్యదర్శులు రాజు, అడ్వకేట్ సత్యనారాయణ రెడ్డి, రవీంద్రనాథ్, నాగమణి, సోమర రాహుల్ పాల్గొన్నారు.

డప్పు కళాకారులపై దాడి హేయం

◆నిందితులపై చర్యలు తీసుకోవాలి

◆కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండలం తలుపూరు గ్రామంలో మొహరం పండుగ సందర్భంగా డప్పు కళాకారులైన చిన్నప్ప, పెద్దన్న, ఓబులేసులపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. తలుపూరు గ్రామంలో బుధవారం నాడు మొహరంలో డప్పులు కొడుతుండగా అదే గ్రామానికి చెందిన పెత్తందారులు పధ్వి, హరి, ఎర్రిస్వామిలు మద్యం తాగి డప్పు కళాకారులు చిన్నప్ప, పెద్దన్న, ఓబులేసులపై దాడి చేశారన్నారు. డప్పులను దౌర్జన్యంగా లాక్కొని కులం పేరుతో దూషిస్తూ గాయపడేలా కొట్టారన్నారు. గాయాల పాలైన వారికి తక్షణం వైద్య సదుపాయం అందించాలన్నారు. దాడికి పాల్పడిన పథ్వి, హరి, ఎర్రిస్వామిలపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డప్పు కళాకారులను సమీకరించి ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ ఆత్మకూరు మండల అధ్యక్షులు ఎట్టి నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్, తలుపూరు గ్రామ డప్పు కళాకారుల సంఘం అధ్యక్షులు పెద్దన్న, కార్యదర్శి వి.పెద్దన్న, నారాయణ పాల్గొన్నారు.

బాలికకు అండగా ఉంటాం : సిపిఎం

ప్రజాశక్తి-రాయదుర్గం

పెళ్లి కాకుండానే బిడ్డను ప్రసవించిన బాలికకు అండగా ఉంటామని, ఆమెకు న్యాయం జరిగేంత వరకూ పోరాటం చేస్తామని సిపిఎం డి.హీరేహాల్ మండల కార్యవర్గ సభ్యులు ఎం.మల్లికార్జున తెలి పారు. డి.హీరేహాల్ మండలానికి చెందిన ఓ బాలిక పెళ్లి కాకుండానే గర్భం దాల్చి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం ప్రస వించింది. ఈ విషయం తెలుసుకున్న మల్లికార్జున, గంగాధర బుధవారం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి బాలికను పరామర్శించారు. ఆ బాలిక పదో తరగతి చదువుతు న్నప్పుడే అదే గ్రామానికి చెందిన మంజునాథ మాయమాటలు చెప్పి లోబరుచుకుని గర్భవతిని చేశాడు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు తెలుపలేదు. మంగళవారం మధ్యాహ్నం ఆమె కడుపు నొప్పితో బాధపడుతుండగా తండ్రి రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు పురిటి నొప్పులతో ఉన్నట్లు గ్రహించి ప్రసవం చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న పెద్దలు ఆ బాలికకు, మంజునాథకు పెళ్లి చేయాలని నిశ్చయించారు. అయితే బాలికకు అన్యాయం చేయాలని చూస్తే తాము సహించేది లేదని, ఆందోళన చేస్తామని వారు స్పష్టం చేశారు.

తోపుదుర్తిలో వాటర్ ప్లాంట్ పున:ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని తోపుదుర్తి గ్రామంలో మూతబడిన వాటర్ ప్లాంట్‌ను బుధవారం టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పున:ప్రారంభించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పరిటాల సునీత సహకారంతో టిడిపి నాయకులు బాలాజీ చొరవతో పాడు బడిన వాటర్ ప్లాంట్‌లో మరమ్మతులు చేయించి నూతన మిషనరీ అమర్చి వాటర్ ప్లాంట్‌ను పున:ప్రారంభించామన్నారు. తోపుదుర్తి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం గత టిడిపి ప్రభుత్వ హయాంలో పరిటాల రవీంద్ర మెమో రియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి అతి తక్కువ ధరకు నీటి అందజేశామన్నారు. అయితే 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రాజకీయ కక్షతో ప్రజలకు తాగునీటిని కూడా దూరం చేశారన్నారు. వాటర్ ప్లాంట్‌లో ఉన్న పరికరాలను ధ్వంసం చేయించి, అందులో వెల్డింగ్ షాపు పెట్టించడం అతడి మూర్ఖత్వానికి నిదర్శమ న్నారు. ఆనాటి నుంచి గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలోని టిడిపి సానుభూతిపరులు, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడంతో పాటు అక్రమ కేసులు బనాయించారన్నారు. తోపుదుర్తి బ్రదర్స్ అండ్ ఫ్యామిలీ, వారి చెంచా బ్యాచ్ అనునిత్యం ప్రజల ను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. వారి ఆగడాలకు ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పార న్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో టిడిపి అధికారంలోకి రావడంతో ప్రజలు స్వేచ్ఛగా సంతోషంగా జీవించడానికి అవకాశం వచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు లక్ష్మీ నారాయణ, ఈడిగ ఈశ్వరయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లా

ఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీగా రత్న బుధవారం నాడు పుట్టపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పాటుపడతానని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలిందించేలా కృషి చేస్తామన్నారు. పోలీసు శాఖలో అందరూ చట్టానికి లోబడి ఉద్యోగం చేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై పర్యవేక్షణ చేస్తూ జిల్లాలో క్రైమ్ రేట్ పెరగకుండా చూస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. ఇసుక అక్రమణ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.



ఏకలవ్యుని జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ఏకలవ్యుని విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తాం

◆ఎరుకుల కార్పొరేషన్ తీసుకొస్తాం

◆ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలో ఏకలవ్యుని విగ్రహం ఏర్పాటు కోసం కషి చేస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. బుధవారం నాడు నవోదయ కాలనీలో మహేశ్వరి ఏకలవ్య మహిళా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమా మహేశ్వరి ఆధ్వర్యంలో ఏకలవ్యుని జయంతి వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎరుకుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. నగరంలో ఏకలవ్యుని విగ్రహం లేదని ఎరుకుల సంఘం నాయకులు ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి ఖచ్చితంగా విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిరంజీవి, సంఘం రాష్ట్ర నాయకులు సాకే వీర, సుధాకర్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 50 వేలు వితరణ

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ సాయి ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణ పుట్టినరోజు సందర్భంగా బుధవారం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి రూ. 50 వేలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు నేటి నుంచి నిత్యాన్నదానానికి విరాళాలు సేకరిస్తున్న నేపథ్యంలో పురుషోత్తమ మురళీకృష్ణ మొదటి దాతగా రూ. 50 వేలు విరాళం ఇచ్చారు. అలాగే తొలి ఏకాదశి సందర్భంగా పురుషోత్తమ మురళీకృష్ణ, నిర్మలమురళి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేవుడు తమకు ఇచ్చిన దానిలో కొంత పేదలకు సహాయం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పేదల ఆకలి తీర్చడానికి బాధ్యతగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పుట్టినరోజు సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి కళ్యాణదుర్గం రోడ్డు ప్రాంతంలోని కల్పవృక్షం విల్లాస్ ఆవరణలో 20 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కేశవ్ చంద్ర, బాబురావు, ప్రతాప్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కుళ్లాయిస్వామి అగ్నిగుండ ప్రవేశం

గూగూడుకు తరలివచ్చిన భక్తులు

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని గూగూడు గ్రామంలో జరుగుతున్న కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం అగ్నిగుండ ప్రవేశం కన్నుల పండువగా సాగింది. వేడుకలను తిలకించడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కుళ్లాయిస్వామి అగ్నిగుండ ప్రవేశ సమయంలో కుళ్లాయిస్వామి స్వామిలో భక్తులకు వెంకటేశ్వర స్వామి నామాలు కనిపిస్తాయని ప్రతీతి. దీంతో ఆ సమయంలో భక్తులు పెద్ద ఎత్తున కుళ్లాయి స్వామి గోవిందా గోవిందా అంటూ గోవింద నామస్మరణ చేశారు. సాయంత్రం 4 గంటల సమయంలో కుళ్లాయిస్వామి జలధి కార్యక్రమం ఉంటుందని, తిరిగి శు క్రవారం రాత్రి కుళ్లాయి స్వామి చివరి దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకేతపురం శోభ, హుస్సేనప్ప తెలిపారు.



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న గూగూడు కుళ్లాయి స్వామి

నేడు గూగూడు హుండీల లెక్కింపు

నార్పల : మొహర్రం సందర్భంగా మండలంలోని గూగూడు గ్రామంలో కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీలను గురువారం ఉదయం 10 గంటలకు కుళ్లాయి స్వామి పీర్లచావిడి ఆవరణలో గ్రామ పెద్దలు దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి సాకేతపురం శోభ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వైసిపి భూదందాలను ప్రజలకు తెలియజేస్తాం

కొండల్ని మింగిన అనకొండ జగన్ రెడ్డి - ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



విలేకరులతో మాట్లాడుతున్న దగ్గుబాటి ప్రసాద్, వెంకట శివుడు యాదవ్

ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన భూతంధాలు, సహజ వనరుల దోపిడీ గురించి ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ తెలిపారు. అనంతపురం జిల్లా టిడిపి కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు గురించి ప్రజలంతా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే శ్వేత పత్రం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని వివరాలనూ వెల్లడిస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో దాదాపు 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని.. వాటి విలువ రూ.35,576 కోట్లు పైనే ఉంటుందన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో 10 వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9,750 కోట్ల దోచుకున్నారని ఆరోపించారు.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వైసీపీ నేతలు భూదోపిడీకి పాల్పడ్డారని చెప్పారు. రుషికొండలో రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టి ప్రజా ధనాన్ని వృథా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ జిల్లా కార్యాలయాల కోసం రెండేసి ఎకరాలను నామమాత్రపు రుసుంతో 33 ఏళ్ల లీజుకు ఇచ్చుకోవడం దోపిడీ కాదాని ప్రశ్నించారు. కొండలను సైతం జగన్ రెడ్డి ప్రభుత్వం అనకొండల్లా మింగేసిందన్నారు. వీటన్నింటిపై కూటమి ప్రభుత్వం విచారణ చేసి, ప్రతి ఎకరానూ వెనక్కు తీసు కుంటుందన్నారు. వైసీపీ చేసిన అక్రమాలన్నింటినీ సాక్షదారాలతో సహా శ్వేతపత్రం ద్వారా విడుదల చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టిడిపి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచి హరి, బలిజ సంఘం నాయకుడు రాయల్ మధు పాల్గొన్నారు.

ఉద్యోగులతో చర్చించి ఐఆర్ ప్రకటించాలి

ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇటీవల రాష్ట్రంలో కొలువుదీరిని నూతన కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి 12వ పీఆర్సీకి సంబంధించిన మధ్యంతర భతిని(ఐఆర్) ప్రకటించాలని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎన్.రమణారెడ్డితో కలిసి మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కడుపు మంట నుంచి వచ్చిన చైతన్య ఫలితమే నూతన కూటమి ప్రభుత్వమన్నారు. ఈ ప్రభుత్వమైనా ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా 12వ పీఆర్సీలో భాగంగా మధ్యంతర భతిని ప్రకటించాలన్నారు. గత పీఆర్సీకి సంబంధించిన బకాయిలు, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎపిజిఎల్ఐ ఫైనల్ పేమెంట్లు, మెచ్యూర్ బాండ్ల పేమెంట్లను త్వరితగతిన చెల్లించేలా ఆర్థిక శాఖను ఆదేశించాలని కోరారు. పురపాలక ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు, జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కెజిబివి ఉపాధ్యాయినులకు ఎంటిఎస్ అమలు చేస్తు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జీవో 117ను రద్దు చేయాలన్నారు. 3,4,5 తరగతుల విలీనాన్ని రద్దు చేసి ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమం కొనసాగించాలని కోరారు. 1998, 2008 డీఎస్సీ ఎంటిఎస్ ఉపాధ్యాయులకు 62 సంవత్సరాల ఉద్యోగ విరమణ, రెగ్యులర్ ప్రాతిపదికన నియామకం చేసి వారికీ న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, ఆర్థిక కార్యదర్శి జి.ప్రసాద్, జిల్లా ఇన్‌ఛార్జి సి.నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.సూర్యుడు, కె.చంద్ర శేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకులు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఘాట్‌ను సందర్శించిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-శింగనమల

మహారాష్ట్రలోని నాగపూర్ సిటీలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఘాట్ (చైతన్య భూమి)ని బుధవారం పలువురు ఎమ్మెల్యేలు సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించా రు. వారిలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజుతో పాటు పూతలపట్టు, పార్వతీపురం, నందికొట్కూరు, కోడుమూరు ఎమ్మెల్యేలు మురళిమోహన్, విజయ్ చంద్ర, జయసూర్య, దస్తగిరి ఉన్నారు.



అంబేద్కర్ ఘాట్ (చైతన్య భూమి)వద్ద ఎమ్మెల్యేలు


యల్లనూరులో ఒక చోటికి చేరిన వివిధ గ్రామాల పీర్లు


శింగనమల : సోదనపల్లిలో పాదస్పర్శ కోసం నేలపై ప్రణమిల్లిన భక్తులు


పుట్లూరులో పీరు ఎత్తుకుని అగ్నిగుండంలో దిగిన భక్తుడు

కనుల పండువగా మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి-యల్లనూరు

యల్లనూరు మండలంలోని సింగవరం గ్రామంలో బుధవారం మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. చుట్టుపక్కల గ్రామాలైన తిమ్మంపల్లి, చింతకాయమంద, కల్లూరు, గొడ్డుమర్రి గ్రామాలతో పాటు సింగవరం పీర్లు ఒకే వేదిక వద్దకు చేరుకోగా భక్తులు దర్శించుకున్నారు. వేడుకల్లో ఆయా గ్రామ సర్పంచులు, పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని వివిధ గ్రామాలతో పాటు ఎల్లుట్ల గ్రామంలో అశేష భక్తజనం నడుమ కుళ్లాయిస్వామి పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. తెల్లవారుజామున పురవీధుల్లో ఊరేగించారు. డప్పు, సంగీత వాయిద్యాల నడుమ చిన్న పెద్ద తేడా లేకుండా అలావ్ తొక్కుతూ సందడి చేశారు. అగ్నిగుండం ప్రవేశం తిలకించేందుకు భక్తజనం పెద్దఎత్తున పోటెత్తారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు.

శింగనమల : మండలంలోని సోదనపల్లి గ్రామంలో మొహర్రం వేడుకలు ముగిశాయి. పీర్లకు భక్తులు చక్కెర ముడుపులు సమర్పించారు. సాయంత్రం 4 గంటలకు పురవీధుల గుండా డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించారు. పీర్ల ముందు అలావ్ తొక్కుతూ ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. సాయంకాలం 6 గంటల సమయంలో పీర్లు జలధికి తరలించారు.

పెద్దపప్పూరు : మండలంలోని కుమ్మెత, వెంగంపేట, పెద్దఎక్కలూరు, చాగల్లు గ్రామాల్లో బుధవారం పీర్లు జలధికి తరలి వెళ్లాయి. గ్రామ పెద్దలు, కమిటీ మెంబర్ల ఆధ్వర్యంలో తెల్లవారు జామున 4 గంటల నుంచి గ్రామమంతా మేళతాళాల మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. ఉదయం 7 గంటల సమయంలో అగ్నిగుండ ప్రవేశం చేశారు. సాయంత్రం గ్రామంలో భక్తజనం ఆనందోత్సాహాల మధ్య ఊరేగింపుగా వెళ్లి సాయంత్రం 7 గంటల సమయంలో జలధికి తరలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ గౌస్‌బాషా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిన్నకౌకుంట్లలో అపశృతి.. అగ్నిగుండంలో పడి వ్యక్తికి గాయాలు

వజ్రకరూరు : మొహర్రం వేడుకల్లో భాగంగా ఉరవకొండ మండలంలోని చిన్న కౌకుంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో పడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. తెల్లవారుజామున గ్రామస్తులు పీర్లను ఎత్తుకుని అగ్నిగుండం ప్రవేశం చేశారు. పీర్ల వెనుకే ఉన్న గ్రామానికి చెందిన చాకలి ఆదినారాయణ కాలు జారి అగ్నిగుండంలో పడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని బయటకు తీశారు. అప్పటికే అతడు తీవ్రంగా గాయపడగా 108 ద్వారా అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

వైభవంగా తొలి ఏకాదశి


ప్రత్యేక అలంకరణలో పాండురంగస్వామి

వజ్రకరూరు : ఆషాఢ శుద్ధ ఏకాదశి(తొలి ఏకాదశి) పర్వదినం పురస్కరించుకుని ఉరవకొండ పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి విశేషపూజలు గంధాభిషేకం, తులసి అర్చన, విష్ణు సహస్ర నామావళి, పారాయణం కార్యక్రమాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం గోవిందనామస్మరణతో మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రాయదుర్గం : ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా రాయదుర్గం పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బళ్ళారిరోడ్డులోని రుకుమాబాయి సమేత పాండురంగస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, భజనలు, పల్లకిసేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఓబుళాచారి రోడ్డు వద్ద వెలసిన రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, పల్లకిసేవ నిర్వహించారు. అనేకమంది భక్తులు పాండురంగస్వామి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పాత్రికేయులు

ఎంపీ విజయసాయిరెడ్డిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రాయదుర్గం

జర్నలిస్టుల పట్ల దురుసుగా మాట్లాడిన రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రాయదుర్గం జర్నలిస్టులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఎపియు డబ్ల్యుజె తాలూకా ప్రధాన కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విజయసాయిరెడ్డి ఇటీవల విశాఖ పట్నంలో జర్నలిస్టుల ఆత్మాభిమానం దెబ్బతీసేలా మాట్లాడటాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఖబడ్దార్ విజయసాయిరెడ్డి అని హెచ్చరించారు. అనంతరం మెయిన్ బజార్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఎఐవైఎఫ్ తాలూకా కార్యదర్శి కొట్రేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.


తాగునీటి సమస్యపై సమీక్షిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప

తాగునీటి సరఫరాపై సమీక్ష

రాయదుర్గం : మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప బుధవారం తన నివాసంలో మున్సిపల్ ఫిట్టర్లు, వాటర్ లైన్‌మెన్లతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో నీటి సమస్య గురించి తెలుసుకుని ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వార్డుల్లో మోటార్ల మరమ్మతులు ఉంటే తొందరగా చేయించాలని, నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అదనపు ట్యాంకర్లతో సరఫరా చేసి నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని సూచించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు తక్కువగా ఉన్నందున పొదుపుగా వాడుకోవాలని లైన్‌మెన్లు వార్డుల్లో ప్రజలకు తెలపాలని సూచించారు. నీరు వదిలినప్పుడు వార్డు సభ్యులు, ప్రజలకు తెలపాలని, ఏదైనా సమస్య ఏర్పడితే ముందస్తుగా అధికారులకు తెలిపి చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

బెళుగుప్ప : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం ఇనిస్టిట్యూషనల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపీడీవో సుబ్బరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. మొక్కలు నాటే కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

గురుపౌర్ణమికి నీలకంఠాపురంలో భిక్షాటన

మడకశిర రూరల్ : మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి గ్రామస్తులతో కలిసి బుధవారం భిక్షాటన చేశారు. మడకశిర పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం నిర్వహించే గురు పూర్ణిమ పూజ సందర్భంగా వారు భిక్షాటన చేశారు. వారు భిక్షాటన చేసి సేకరించిన వస్తువులను మడకశిర సాయిబాబా ఆలయం వారికి అందజేశారు.

24న జాషువా వర్ధంతి.. ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ


గుర్రం జాషువా వర్ధంతి ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-అనంతపురం

పద్మభూషణ్, నవయుగ కవి చక్రవర్తి, మధుర శ్రీనాథ బిరుదాంకితుడు మహాకవి గుర్రం జాషువా 53వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 24వ తేదీ జాషువా విగ్రహానికి పుష్పాలంకరణ, సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు జాషువా సాహిత్య పీఠం నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం నగరలోని విశాలాంధ్ర బుక్ హౌస్‌లో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు ఆర్ట్స్ కళాశాల ప్రధాన గేటుకు ఎదురుగా ఉన్న మహాకవి గుర్రం జాషువా విగ్రహానికి నగర ప్రముఖులతో పుష్పమాల అలంకరణ, 11 గంటలకు ఆర్ట్స్ కళాశాలలోని కామర్స్ సెమినార్ హాలులో జాషువా సాహిత్యంపై సాహితీ సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సుకు ప్రధాన వక్తగా జనప్రియ కవి ఏలూరు యంగన్న, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు ఆచార్య జి.బాలసుబ్రహ్మణ్యం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దివాకర్‌రెడ్డి, ఎస్కేయు మాజీ రిజిస్ట్రార్ కె.సుధాకర్‌బాబు, తదితరులు హాజరై జాషువా సాహిత్యంపై ప్రసంగిస్తారన్నారు. అలాగే జాషువా సాహిత్యంపై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. కావున సాహితీవేత్తలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, జాషువా సాహిత్య అభిమానులు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి హెచ్.నాగలింగయ్య, ఎస్కేయు తెలుగు శాఖలో అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, విశాలాంధ్ర బుక్ హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, సిఎన్. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'మన్నించండి.. మర్యాదగా నడుచుకుంటా'..

ప్రజాశక్తి-తాడిపత్రి

సార్వత్రిక ఎన్నికల ముందు జెసి ప్రభాకర్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించి వైసిపి కండువా కప్పుకున్న న్యాయవాది శ్రీనివాసులు బుధవారం పట్టణంలోని జెసి ఇంటికి వెళ్లి 'నన్ను మన్నించండి.. ఇకపై మర్యాదగా నడుచుకుంటా'నని వేడుకున్నారు. అయితే 'నీ మర్యాదలు ఏమీ వద్దు.. వెళ్లిపో' అని జెఇ ప్రభాకర్‌రెడ్డి సూచించినా అతను వెళ్లలేదు. దీంతో జెసి ఆదేశాలతో ఆయన అనుచరులు న్యాయవాది శ్రీనివాసులును ఎత్తుకొని ఇంటి ముందు రహదారిపై వదిలిపెట్టారు. న్యాయవాది శ్రీనివా సులు జెసి ప్రభాకర్‌రెడ్డి వ్యక్తిగత లాయర్‌గా కొనసాగుతుండేవారు. సార్వత్రిక ఎన్నికల ముందు జెసి ప్రభాకర్‌రెడ్డిపై తీవ్రమైన ఆరోపణలు గుప్పించారు. టిడిపి నుంచి ఎవరు వాయిస్ వినిపించినా తాను ముందుండి సమాధానమిస్తానంటూ ప్రకటించారు. న్యాయవాది అయిన నాకు జెసి ప్రభాకర్ రెడ్డితో పాటు వారి అనుచరులు కనీస గౌరవం ఇవ్వలేదని ఆరోపించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆయన ప్రత్యర్థికి వ్యక్తిగత లాయర్‌ని అయినప్పటికీ చాలా హుందాగా నడుచుకుంటూ గౌరవంగా పలకరించా రన్నారు. జెసి నుంచి నాకు తీవ్రమైన అవమానం జరిగినందున జీర్ణించుకోలేక వైసిపిలో పార్టీలో చేరుతున్నట్లు నాడు ప్రకటించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో జెసి ప్రభాకర్ రెడ్డి తనయుడు జెసి అస్మిత్ రెడ్డి విజయం సాధించడంతో న్యాయవాది శ్రీనివాసులు కారణాలు బహిర్గతం చేయకుండా ప్రత్యక్షంగా జెసి ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి మన్నించమని వేడుకోవడం చర్చకు దారి తీసింది.

జెసి ప్రభాకర్ రెడ్డి ఎదుట లాయర్ వేడుకోలు


న్యాయవాది శ్రీనివాసులుతో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

ఏకలవ్యుడి జీవితం యువతకు ఆదర్శం


ఏకలవ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎరుకల సేవా సంఘం సభ్యులు

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్ ఆధ్వర్యంలో బుధవారం ఉరవకొండ పట్టణంలో ఎరుకల ఆరాధ్య దైవమైన ఏకలవ్యుడు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా వద్ద నుంచి ర్యాలీగా బయల్దేరి కవిత హోటల్ సర్కిల్ వద్ద ఏకలవ్యుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. అనంత రం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. వారు మాట్లాడుతూ యువత ఏకలవ్యుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఎరుకుల సాకే వసంత్, ప్రధాన కార్యదర్శి సాకే పురుషోత్తం, జనరల్ సెక్రటరీ సాకే మహేంద్ర, ఉపాధ్యక్షులు వై.గంగన్న, సెక్ర టరీ సుబ్బరాయుడు, నరసింహులు, వీరేష్ , ఆంజనేయులు, శేషాద్రి, అజ్జప్ప, వీరేంద్ర, సోమశేఖర్, సుధాకర్, ప్రధాన కార్యదర్శి వై.హనుమంతు, టీచర్ ఎర్రిస్వామి, జలంధర్, రాజు, విడపనకల్ శంకర య్య, వై.ఆంజనేయులు, చిన్న దేవన్న, వై.తిమ్మప్ప, ప్రసాద్, ఉరుకుందప్ప, శంకరప్ప, వై.రాము, ఎర్రి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి ఏకలవ్యుడు: ఎరుకుల సేవా సంఘం

గుంతకల్లు : ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకుని ఎరుకల సామాజిక వర్గం ప్రజలు అన్ని రంగాల్లో రాణించాలని ఎరుకల సేవా సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గురుగుంట్ల ప్రభాకర్ పిలుపు నిచ్చారు. ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రభాకర్ అధ్యక్షతన ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా వారు ఏకలవ్య చిత్రపటానికి, అనంతరం భాగ్యనగర్‌లోని ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ ఏకలవ్యుని దీక్ష, పట్టుదలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం పట్టణ అధ్యక్షులు టీచర్ వై.వెంకటేశ్వర్లు, కోశాధికారి కరేపాకు నాగరాజు, రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు ఎం.వరప్రసాద్, సభ్యులు కమలపాడు నారాయణస్వామి, వై.నాగరాజు, లక్ష్మీనారాయణ, కె.శ్రీనివా సులు, కె.గాదిలింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

కదిరి టౌన్ : కదిరి పట్టణం లోని రేణుక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఓ మహిళ కడుపులో ఉన్న 12 కిలోల గడ్డను వైద్యులు తొలిగించారు. ఇందుకు సంబంధించి వైద్యులు తెలిపిన వివరాలు...కదిరి పట్టణానికి చెందిన మహిళా ఈ నెల 15న రేణుక హాస్పిటల్‌కు వచ్చింది. 4 సంవత్సరాలుగా పొట్టవాపుతో ఇబ్బంది పడుతున్నానని చెప్పింది. దీంతో వైద్యులు పరీక్షలు చేసి అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని చెప్పారు. అందుకు పేషెంట్, వారి బంధువులు అంగీకరించడంతో రేణుక హాస్పిటల్ వైద్యుల బృందం డాక్టర్. రేణుకారెడ్డి, డాక్టర్ అనూష సలహాతో శస్త్ర చికిత్స నిర్వహించారు. మహిళ కడుపులో నుంచి 5 లీటర్ల అసిటిఎస్ ఫ్యూయిడ్‌తో పాటు 12 కిలోల గడ్డను తొలగించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు రేణుకా రెడ్డి, డాక్టర్ అనుష అశోక్ రెడ్డి తెలిపారు. ఇలాంటి ఎన్నో రకాల శస్త్రచికిత్సలకు ఇక్కడి ప్రజలు బెంగళూరు హైదరాబాద్ వంటి నగరాలకు వెళుతుంటారని అలాంటి వారికి కదిరిలోనే ఇలాంటి ఆపరేషన్లు చేసి మెరుగైన సేవలు అందించాలని లక్ష్యంతో పని చేస్తునానమని డాక్టర్ రేణుకారెడ్డి, డాక్టర్ అశోక్ కుమార్ రెడ్డి తెలిపారు.

ఎంఎన్‌సి కంపెనీల్లో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీల్లో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కొడికొండ చెక్‌పోస్టులోని రక్షా అకాడమీ హెడ్ ట్రైనీ కిరీట్ నాయర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరులోని పలు మల్టీనేషనల్ కంపెనీల్లో పనిచేసేందుకు యువతీ,యువకులుకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. వేతనం రూ.19 వేలు ఉంటుందన్నారు.దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రక్షా అకాడెమీలో శిక్షణ కూడా అందజేయనున్నట్టు తెలిపారు. 10 వ తరగతి ఉత్తీర్ణత సాధించి 18-30 ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కన్నడ, ఇంగ్లీష్ భాషలు తెలిసి ఉండాలన్నారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక

ఓబుళదేవర చెరువు : స్థానిక రెయిన్‌బో పాఠశాలలో చదివిన నల్లమాడ మండలం గంగాపురం గ్రామానికి మేఘనాథ్ రెడ్డి అనే విద్యార్థి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించినట్లు రెయిన్‌బో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయసింహా రెడ్డి తెలిపారు. 2023-2024 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనపర్చి ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన మేఘనాథ్‌రెడ్డిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

'శ్రీవిజ్ఞాన్' విద్యార్థిని

ఓబుళదేవరచెరువు : శ్రీ విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివిన విద్యార్థిని దివ్యశ్రీ ఇడుపులపాయ ట్రిపుట్ ఐటిలో సీటు సాధించింది. నల్లమాడ మండలం పులగం పల్లికి చెందిన దివ్యశ్రీ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తమ పాఠశాలలో చదివి పదవ తరగతిలో అత్యధికంగా 583 మార్కులు సాధించి ట్రిపుట్ ఐటిలో సీటు సాధించడం సంతోషంగా ఉందని శ్రీ విజ్ఞాన్ కరస్పాండెంట్ మస్తాన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, కరెస్పాండెంట్ అభినందించారు.

నేరాలు ఘోరాలు

నార్పలలో రెండిళ్లలో చోరీ

34 తులాల బంగారం, రూ. 2 లక్షల నగదు అపహరణ


బీరువాలోని వస్తువులను చెల్లాచెదురుగా చేసిన దొంగలు

ప్రజాశక్తి-నార్పల

నార్పలలో మంగళవారం రాత్రి దొంగలు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడి 34 తులాల బంగారం ఆభరణాలు, సుమారు రూ. 2 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. వివరాలు.. దొంగలు స్థానిక మసీదు కట్ట వీధికి చెందిన గాంధ్ర ఒబయ్య ఇంట్లో 28 తులాల బంగారం, రూ. 80 వేల నగదు, అదే వీధిలో గంధో ది వేణుగోపాల్ ఇంట్లో 6 తులాల బంగారం, రూ. లక్ష నగదు ఎత్తుకెళ్లారు. నార్పలలో కొద్ది కాలం నుంచి రెక్కీ నిర్వహించి, పోలీసులు గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల విధుల్లో నిమగ్నమై ఉండడం పసిగట్టిన దొంగలు కుళ్లాయి స్వామి పెద్ద సరిగెత్తు రోజున మంగళవారం రాత్రి పథకం ప్రకారం చోరీలకు పాల్పడ్డారు. నాలుగు రోజుల క్రితం మసీదు కట్ట కాలనీలోనే ముస్లిమ్ ఇంట్లో కూడా చోరీ జరిగింది. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, పోలీసులతో కలిసి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్‌ను పిలిపించారు. క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరి స్తున్నారు. అతి త్వరలో దొంగలను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

చిరు వ్యాపారి దారుణహత్య

ప్రజాశక్తి- సోమందేపల్లి

ఓ చిరు వ్యాపారి దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం పెనుకొండ మండలం గుట్టూరులో చోటుచేసుకుంది. కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రంగడు తెలిపిన వివరాలు... హిందూపురంలోని బోయ వీధికి చెందిన చిన్న అంజనప్ప(63), భార్య మంజమ్మ గ్రామాల్లో తిరుగుతూ పూజా సామగ్రి అమ్ముకొని జీవనం సాగించేవారు. ఈ నేపథ్యంలో గూగూడు ఉత్సవాల్లో భార్య మంజమ్మ వ్యాపారం చేస్తుండడంతో చిన్న అంజన్న మండలంలోని గ్రామాల్లో తిరుగుతూ పూజా సామగ్రి వ్యాపారం నిర్వహించాడు. బుధవారం గుట్టూరు గ్రామంలో వారపు సంతలో వ్యాపారం చేసుకుని భార్య వద్దకు వెళ్లేందుకు మంగళవారం రాత్రి గ్రామంలో కొల్లాపురమ్మ దేవాలయంలో నిద్రించాడు. ఆ సమయంలో మునిమడుగు గ్రామానికి చెందిన గంగాధర్ ఉరఫ్ గంగాద్రి అనే వ్యక్తి దేవాలయంలో నిద్రిస్తున్న చిన్న అంజనప్పతో వాదనకు దిగాడు. దేవాలయంలో నిద్రించకూడదని హెచ్చరించాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో కోపంతో రెచ్చిపోయిన గంగాద్రి అంజినప్పను గుడిలో నుంచి కొట్టుకుంటూ ఈడ్చుకొని బయటికి వచ్చి అతని మెడలో ఉన్న టవల్‌తో గొంతుకు బిగించాడు. దీంతో అంజినప్ప మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి బాబీజాన్ సైదా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణ సమీపంలోని ఆర్ వి జానకి రామయ్య పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. కొత్తచెరువు నుంచి పుట్టపర్తి జనరల్ ఆసుపత్రికి ప్రయాణికులతో వస్తున్న ఆటో ఎయిర్‌పోర్టు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు రాగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ప్రయాణికులతో పాటు డ్రైవర్ రవి కి తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికుల్లో లోచర్ల గ్రామానికి చెందిన ఒక గర్భిణీ కూడా ఉంది. గర్భిణీతో పాటు డ్రైవర్ రవి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పుట్టపర్తి అర్బన్ పోలీసులు తెలిపారు.


చెరువు కట్ట కింద ఉన్న పాడుబడిన బావి

ఆదమరిస్తే అంతే..!

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని సానిపల్లి గ్రామ సమీపంలో చెరువు కట్ట కింద ఓ పాడుబడిన బావి ఉంది. ఇది గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు కావడంతో ఏ క్షణమైనా ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి వెళ్లాలి అంటే పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై నుంచి తురకలా పట్నం వద్ద నుంచి చెరువు కట్ట మీదుగా వెళ్లాలి. కట్టకు అనుకుని చెరువు కింద ఉన్న పొలంలో గతంలో ఓ బావి తవ్వారు. ప్రస్తుతం ఆ బావి నీరూ లేక పాడుబడి వృథాగా ఉంది. ఈ మార్గంలో విద్యార్థులు, గ్రామస్తులు సైకిళ్ళ, ద్విచక్ర వాహనాల్లో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానం రాత్రి వేళ ఏమాత్రం ఆదమరచినా ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కావున అధికారులు స్పందించి ఆ బావిని పూడ్పించాలని కోరుతున్నారు.